క్లుప్తంగా

కంటి శస్త్ర చికిత్సకు 30 మంది ఎంపిక



రోగికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ భవాని

సామర్లకోట: స్థానిక ఆంధ్రాబాప్టిస్టు చర్చిలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ శిబిరాన్ని విశ్రాంత హెచ్ఎం ఐవీ జీవన్‌కుమార్ ప్రారంభించారు. కాకినాడ కిరణ్‌కంటి ఆస్పత్రి డాక్టర్ భవానీ కంటి పరీక్షలు చేశారు. శిబిరానికి హాజరైన వారికి శేఖర్ కౌన్సిలింగ్ చేశారు. ఆస్పత్రి పీఆర్వోలు వై.శివగణేష్, ప్రసాద్, సిబ్బంది హేమ, హైమావతి, ఇస్మాయిల్, సునీత, అశ్విని, సత్య, ఫాస్టర్ బి.కిరణ్‌కుమార్, చర్చి సంఘ ప్రతినిధి బీఎస్ వందనం రోగులకు సేవలందించారు. శిబిరంలో 154 మంది హాజరు కాగా 32 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు డాక్టరు భవాని తెలిపారు.

విద్యార్థులకు కంచాల వితరణ



విద్యార్థులకు కంచాలు అందజేస్తున్న దాత

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి కృషితో పిఠాపురం మహారాజా సంస్థానం సౌజన్యంతో ప్రారంభమైన భోజన పథకానికి వంద కంచాలు సమకూరాయి. కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు బాదం ప్రకాష్ గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీడీసీ సభ్యులైన కొండేపూడి శంకర రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కేవీఎస్ఎస్ ప్రసాద్, భోజన పథకం కన్వీనర్ ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథోత్సవం



మూలపేటలో సాగుతున్న రథోత్సవం

కొత్తపల్లి: మూలపేటలో కొలువైన బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి (మొండి జగ్గప్ప), దేవి, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవంలో భాగంగా గురువారం రాత్రి స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్యాండ్ పార్టీలు, విద్యుత్ దీపాలు, మందుగుళ్ల సామగ్రితో స్వామిని ఊరేగించారు. అనంతరం భక్తులు వచ్చి స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ రథోత్సవంలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో భద్రత కల్పించారు.

నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

పిఠాపురం: మండలంలోని చిత్రాడ గ్రామం వద్ద జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ పార్టీ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ వారం రోజులుగా ఇక్కడే ఉండి అన్ని ఏర్పాట్లూ పర్యవేక్షించారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యే అవకాశాలున్నందున దానికి తగ్గట్టుగా విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

కాకినాడ సిటీ: జెడ్పీ యాజమాన్య పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ అనారోగ్య కారణాల వల్ల మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులు ఇద్దరికి ఆఫీసు సబార్డినేట్ పోస్టులలో నియమిస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ యాజమాన్య పరిధిలో ఉన్న పాఠశాలలు, మండల పరిషత్‌లలో ఖాళీలు ఏర్పడగానే ఎప్పటికప్పుడు దరఖాస్తుల నిబంధనలకు అనుగుణంగా కారుణ్య నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు.

అంధకారంలో టిడ్కో కాలనీ

- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- నాలుగు బ్లాక్‌లకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్



ఉప్పువారి సత్రం వద్ద ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయం

సామర్లకోట: అరకొర విద్యుత్ సదుపాయాలతో స్థానిక ఉప్పువారి సత్రం వద్ద ఉన్న టిడ్కో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విడుదల చేసిన నిధులతో అప్పటి పెద్దాపురం దివంగత ఎమ్మెల్యే తోట గోపాలకృష్ణ జగ్గమ్మగారిపేటలో 12 ఎకరాలు, ఉప్పువారి సత్రం ఎదురుగా సుమారు 12 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. జగ్గమ్మగారిపేటలో 2009లో గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మహానేత వైఎస్సార్ తదనంతరం పనులు నత్తనడకన సాగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లి అమ్మణ్ణమ్మ పేరుతో గృహ సముదాయాన్ని ప్రారంభించారు. తదుపరి ఉప్పువారి సత్రం, జగ్గమ్మగారిపేటలోని ఉన్న మరికొంత భూమిలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి టీడీపీ నేతలు శంకుస్థాపనలు చేశారు. ఉప్పువారి సత్రం వద్ద ఉన్న పంట భూములను ఎత్తు చేయకుండా గృహ నిర్మాణాలు పూర్తి చేయడంతో ఏలేరు వరద సమయంలో టిడ్కో ఇళ్లు నీట మునిగిపోతున్నాయి. ఉప్పువారి సత్రం వద్ద ఉన్న స్థలంలో 20 బ్లాక్‌లతో, బ్లాక్‌కు 32 ఇళ్లతో 640 ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు బాధ్యతను మెప్మా అధికారులకు అప్పగించారు. ఇప్పటికీ చాలా మంది లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయలేదు.



కనెక్షన్ లేక దిష్టి బొమ్మలా మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్

అవస్థలు తప్పడం లేదు

ఉప్పువారి సత్రంలోని టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న వారికి తిప్పలు తప్పడం లేదు. నాలుగు బ్లాక్‌లకు(132 ఇళ్లకు) కేవలం ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల ప్రతి రోజు లో ఓల్టేజ్ సమస్యతో సతమతమవుతున్నామని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో సముదాయంలో లైటింగ్ సరిగా లేకపోవడం వల్ల దొంగతనాలు పెరిగిపోతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. మోటారు సైకిళ్లలో పెట్రోలుతో పాటు, బయట ఉంచిన విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ టిడ్కో సముదాయంలో 640 మంది లబ్ధిదారులు నివాసం ఉండాల్సి ఉండగా మౌలిక వసతులు లేకపోవడంతో కేవలం 70 కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి.

వేసవిలో మరింత విద్యుత్ సమస్య



మార్చి ప్రారంభం నుంచే విద్యుత్ కోతలు ప్రారంభమయ్యాయి. టిడ్కో ఇళ్ల సముదాయంలో 4 బ్లాక్‌లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వలన లోఓల్టేజ్ సమస్య ఎక్కువగా ఉంది. ఏప్రిల్ నుంచి ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మభ్య పెట్టడానికి దిమ్మ ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వకుండా ఆరు నెలలుగా వదలేశారు. ప్రతి రెండు బ్లాక్‌లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలి. పట్టణానికి శివారులో టిడ్కో ఇళ్ల సమదాయం ఉండడంతో దొంగల బయం తగ్గేలా పోలీసు గస్తీ ఉండాలి.

– కర్రి ఉమామహేశ్వరరావు, టిడ్కో లబ్ధిదారు

ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య పరిష్కరిస్తాం



ఆయా ప్రాంతాలలో లోడ్ ఆధారంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం. కనెక్షన్లు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. లోఓల్టేజ్ లేకుండా చేస్తాం

– ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్, ఈఈ, సామర్లకోట

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

ఆర్డీఓ శ్రీరమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ పరిధిలో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్, డెకాయ్ ఆపరేషన్లు అకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్టు తెలిపారు. డివిజన్ పరిధిలో 40 స్కాన్ సెంటర్లు ఉండగా వాటిలో 11 ప్రభుత్వ శాఖ పరిధిలో ఉన్నాయన్నారు. మరో రెండు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డాక్టర్ అనూషారాయ్, న్యాయవాదులు సత్యవంశీ, ఎన్‌జీఓ సభ్యులు వాసవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా ఉండూరు సంపద కేంద్రం

పెదపూడి ఎంపీడీఓ నరేంద్రరెడ్డి



వర్మీ కంపోస్టు యూనిట్లపై శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

సామర్లకోట: ఉండూరు గ్రామంలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శులు ఆదర్శంగా తీసుకోవాలని పెదపూడి ఎంపీడీఓ నరేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా పెదపూడి, గొల్లప్రోలు మండలాలలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు మండలంలోని ఉండూరు వర్మీ కంపోస్టు యూనిట్‌లో గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. నరేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రతి గ్రామంలో వర్మీ కంపోస్టు యూనిట్ మంచి సంపద తయారీ యూనిట్‌గా గుర్తింపు పొందడంతో నాలుగేళ్ల క్రితం జాతీయ స్థాయిలో అవార్డు అందుకుందన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు తడి, పొడిచెత్తలపై అవగాహన కలిపించి ఆ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. యూనిట్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టుతో మొక్కల పెంచి వాటిని రైతులు, గ్రామ ప్రజలు సందర్శించేలా చూడాలన్నారు. అనంతరం ఉండూరు వర్మీ కంపోస్టు యూనిట్‌ను కార్యదర్శులు, క్లాప్ మిత్రలు సందర్శించారు. కార్యక్రమానికి సర్పంచ్ పంతాడి ధనలక్ష్మి అధ్యక్షత వహించగా గొల్లప్రోలు ఎంపీడీఓ రవిబాబు, ఈఓ పీఆర్డీ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి కె.బుల్లియ్యకాపు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనీ ఎంఎస్ఎన్ రెడ్డి, డీపీఆర్సీ బృందం శిక్షణ ఇచ్చారు.

శ్రీవారికి వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో స్వామివారు

పిఠాపురం: పిఠాపురంలోని టీటీడీ వారి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కబడ్డీ క్రీడాకారులకు కిట్ల అందజేత




ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు కిట్లు అందజేస్తున్న రవిచంద్రప్రసాద్

సామర్లకోట: వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో శుక్రవారం నుంచి జరుగుతున్న 34వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లకు గురువారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ కబడ్డీ కిట్లను అందజేశారు. ఉమ్మడి జిల్లా నుంచి బాలురు, బాలికలను 12 మంది చొప్పున ఈ నెల 9వ తేదీన స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఎంపికైన వారికి కోచ్ అజయ్‌కుమార్, ప్రో కబడ్డీ అంపైర్ బోగిళ్ల మురళీకుమార్, విశ్రాంత పీడీ తాళ్లూరి వైకుంఠం శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తి కావడంతో క్రీడాకారులకు కిట్లు అందజేసి రాష్ట్ర స్థాయి పోటీలో విజయం సాధించాలని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.కిరణ్ పాల్గొన్నారు.

బీసీ, ఈబీసీలకు సబ్సిడీ రుణాలు

సామర్లకోట: కుల వృత్తులు చేసుకునే బీసీ కులాల వారికి ఆర్థికంగా వెనుకబడిన వారికి సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన్నట్లు ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలలో డి ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలను బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా బుట్టలు, కుండలు వంటి చేతి వృత్తి చేసుకునే బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన ఆర్య వైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ కులాలకు చెందిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందుతాయన్నారు. అలాగే కాపు, ఒంటరి, తెలగ, బలిజ కులాలకు చెందిన వారికి రుణాలు ఇవ్వడానికి నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22 తేదీ లోపుగా ఆన్‌లైన్‌లో విద్యార్హత సర్టిఫికేట్లు, కుల, ఆధాయం సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి కులధృవీకరణ పత్రాలతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సచివాలయం నుంచి పొందాల్సి ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం



కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కొనపాపపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల వల్ల మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు గురువారం తెలిపారు. కొనపాపపేట, మల్లివారితోట, రావివారిపోడు, రామరఘవపురం గ్రామాలతో పాటు నాగులపల్లి, రమణక్కపేట రొయ్యల చెరువులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎత్తిపోతల నిర్వహణను రైతులకు అప్పగించాలి



తీర్మాన కాపీని చూపిస్తున్న ఎత్తిపోతల కమిటీ ప్రతినిధులు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం ఎత్తిపోతల పథకం నిర్వాహణ బాధ్యతను రైతులకే అప్పగించాలని ఆయకట్టు రైతుల కమిటీ తీర్మానించింది. గురువారం సాయంత్రం ఎత్తి పోతల పథకం వద్ద ఆయకట్టు రైతుల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ అన్ని ఎత్తిపోతల పథకాల కమిటీల నుంచి తీర్మానాలు కోరినట్టు జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి తెలిపారు. కమిటీల నుంచి ఎటువంటి తీర్మానాలు రాక పోతే ప్రభుత్వమే పథకాలను నిర్వహిస్తుందన్నారు. ఈ మేరకు ప్రతి పంటకు రైతులు ఎకరానికి రూ.వెయ్యి నీటి తీరువా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దాంతో ఎత్తిపోతల కమిటీ నాయకులు రైతులే పథకాన్ని నిర్వహించుకునే విధంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానం ప్రకారం పంపుల మరమ్మతులు, ఆపరేటర్ల జీతాలు, ఇతర ఖర్చులకు ఎత్తిపోతల పథకం కమిటీ భరిస్తుందని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల కమిటీ ముఖ్య ప్రతినిధులు వేగుళ్ల బాబ్జీ, కొండపల్లి రాంబాబు, గున్నం వెంకట్రావు పాల్గొన్నారు.

కుర్చీలు, పెన్నుల బహూకరణ



దాత బహూకరించిన పెన్నులు చూపుతున్న విద్యార్థులు

పిఠాపురం: గొల్లప్రోలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు గురువారం ఒక దాత 15 కుర్చీలు, పదో తరగతి విద్యార్థులకు పెన్నులు బహూకరించినట్టు పాఠశాల హెచ్ఎం ప్రేమకుమారి తెలిపారు. తెనాలి నియోజకవర్గం అత్తోటికి చెందిన దివ్వెల వెంకయ్య నాయుడు పాఠశాలకు వాటిని అందజేసారన్నారు.

ముగిసిన పరీక్షలు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ విద్యాసంస్థల కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సతీష్‌కన్నా తెలిపారు. మొత్తం 267 మంది హాజరుకావల్సి ఉండగా 257 మంది హాజరైనట్టు తెలిపారు. వీటితో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగిశాయన్నారు.

ఎమ్మెల్సీ బొత్సను కలసిన కౌన్సిలర్లు





బొత్స సత్యనారాయణను కలసిన వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, వైస్ చైర్మన్ మోజెస్, కౌన్సిలర్లు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను తాడేపల్లి పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్‌ల నాయకత్వంలో బొత్స సత్యనారాయణను మహిళా, పురుష కౌన్సిలర్లు విడివిడిగా కలసి మున్సిపాలిటీ పరిస్థితిని వివరించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు సూచన ప్రకారం నడుచుకోవాలని కౌన్సిలర్లకు ఆయన సూచించిన్నట్లు తెలిసింది.

పొలంబడితో ఎంతో విజ్ఞానం

జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయకుమార్



నవర పొలంబడిలో పంటను పరిశీలిస్తున్న జెడీ విజయకుమార్, ఏఓ, రైతులు

సామర్లకోట: పొలంబడిలో రైతులు అనేక కొత్త విషయాలు తెలుసుకోవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్. విజయకుమార్ అన్నారు. మండల పరిధిలో నవర గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన పొలంబడిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇండిగ్యాప్ పొలంబడి ఒక గ్రామంలో 30 మంది రైతులతో 25 ఎకరాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పొలంబడికి ముందు రైతులతో బేస్‌లైన్ సర్వే చేసి వారు వాడిన ఎరువులు, క్రిమి సంహారకాల వివరాలు నమోదు చేసుకోనున్నట్టు తెలిపారు. విత్తన శుద్ధి మొదలు పంట కోసే వరకు 14 వారాలు పంటకు అనుగుణంగా పొలంలోనే దానికి తగిన సాంకేతికను జోడించి నూతన శాస్త్రీయ పద్ధతులను రైతులకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలోనూ వారితో చేయించనున్నట్టు తెలిపారు. దీనివల్ల రైతు ఒక సంవత్సరం పాటు పండిచిన ధాన్యాన్ని పూర్తిగా ప్రకృతి సిద్ధంగా పండించిన ధాన్యం ద్వారా వచ్చిన బియ్యాన్ని సొంతంగా విక్రయించవచ్చని తెలిపారు. దీని ద్వారా రైతుకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఎంఏఓ ఐ.సత్య అధ్యక్షత వహిస్తూ ప్రతి వారం నిర్వహించే పొలంబడిలో రైతులు తప్పని సరిగా హాజరై నూతన సాంకేతిక, శాస్త్రీయ పద్ధతులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు గుడివాడ నాగేశ్వరరావు, వెన్నా వీర వెంకటసత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



దుర్గాడలో మామిడి తోటలను పరిశీలిస్తున్న పిఠాపురం ఉద్యాన శాఖాధికారి శైలజ



కట్టమూరులో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ దైవకుమార్

మామిడి రైతులూ.. అప్రమత్తం

పెద్దాపురం: ప్రస్తుత వేసవి దృష్ట్యా మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జానకి, మండల ఉద్యానశాఖాధికారి ఎస్.సుజాత కోరారు. మండలంలోని సీబీ దేవం గ్రామంలో గురువారం వారు మామిడి తోటల క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీహెచ్ఏ మాదబోయిన చిలకమ్మ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికం కానున్న నేపథ్యంలో మామిడి తోటలకు తేలికపాటి తడులు ఇవ్వాలన్నారు. పిందె కట్టే దశలో రెండో దఫా ఎరువులను సిఫారసు ప్రకారం వేసుకోవాలన్నారు. అధికంగా పిందె, పూత రాలుతున్నప్పుడు ప్లానో ఫిక్స్ 4.06 మిల్లీ గ్రాములు 10 లీటర్ల నీటిలోని కలిపి, పిచికారి చేయాలన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ మల్లిక, రైతులు పాల్గొన్నారు.

మామిడి దిగుబడికి సస్య రక్షణ అవసరం

పిఠాపురం: మామిడిపై తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని పిఠాపురం ఉద్యానశాఖాధికారి కేఎస్ శైలజ రైతులకు సూచించారు. ఆమె గొల్లప్రోలు మండలం దుర్గాడలో గురువారం మామిడి పంటలను పరిశీలించి మాట్లాడుతూ మామిడి పంటపై ప్రస్తుతం తామర పురుగు ఎక్కువగా కనిపిస్తోందని ఇది పంటకు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందన్నారు. దీంతో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం మామిడిపై తెగుళ్లు ఆశించే సమయం కాబట్టి రైతులు సస్యరక్షణ చర్యలు అవలంబించాలని తామర పురుగు, ఆకు గూడు పురుగు, తేనె మంచు పురుగు, కాండం తొలుచు పురుగు, పండు ఈగ, పక్షి కన్ను తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సస్యరక్షణ చర్యలను ఆమె వివరించారు.

వరిలో తెగుళ్లతో జాగ్రత్త : ఏడీఏ దైవకుమార్

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరి పంటలో ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ నల్లి దైవకుమార్ అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ శత్రు పురుగుల సంరక్షణతో పాటు మిత్ర పురుగుల సంరక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసే కషాయాలను వాడడం ద్వారా అత్యంత విషపూరితమైన పురుగుల మందుల వాడకం తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు మాదిరెడ్డి రామకృష్ణ, కూరాకుల వెంకట పాపారావు, నాగేశ్వరరావుతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.